క్లుప్తంగా

శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



వినుకొండ (నూజెండ్ల): వినుకొండలోని కొండపై గల శ్రీరామలింగేశ్వరస్వామికి ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అన్నదాన కమిటీ సభ్యులు పంచామృత అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ అధ్యక్షుడు జాజుల మాల్యాద్రి మాట్లాడుతూ తొలి ఏకాదశి పండుగ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 29న భారీ అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెట్టి శ్రీనివాసరావు, ముప్పాళ్ల రమేష్, బద్దిక నరసింహారావు, రాము, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, పద్మ, పార్వతి, 108 సేవకులు పాల్గొన్నారు.

ఆది పరాశక్తి క్షేత్రంలో ప్రత్యేక పూజలు



నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలోని శివప్రియనగర్ ఆది పరాశక్తి క్షేత్రంలో గల గండి పోచమ్మ ఆలయంలో ఆర్యవైశ్య ప్రముఖులు ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపుతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తే కోరికలు తీరతాయనే నమ్మకంతో కొమ్ములు దంచారు. అభిషేకాలు జరిపారు. అనంతరం పీఠాధిపతి శ్రీ నిత్య విద్యానంద భారతీస్వామి ఆశీస్సులతో తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, శ్రీశైలం వాసవీ సత్రం మెంబర్ అనుమాల సుబ్బారావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, త్రిపురాంతకం అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ గోళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

జగద్గురువు శ్రీకృష్ణుడు



చిలకలూరిపేట టౌన్: ఆషాఢ మాసంలో గురు పౌర్ణమి నాడు శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి పూజలు చేయాలని పిడుగురాళ్లకు చెందిన త్రైత సిద్ధాంతం -ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. పట్టణంలోని పండరీపురంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో చంద్రుడు గుండ్రంగా, పెద్దగా ఉండటం వల్ల గురు పౌర్ణమిగా నిర్ణయించారన్నారు. భగవంతుడిగా భూమిపై అవతరించిన శ్రీకృష్ణుడిని జగద్గురువుగా భావించి పూజలు చేయాలని వివరించారు, కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కటికం సైదారావు, కె. అరుణ, కె. కోటేశ్వరరావు, నారాయణమ్మ, గోపి పాల్గొన్నారు.

వివాహానికి మంగళ సూత్రం బహూకరణ



చిలకలూరిపేట టౌన్: వివాహం చేసుకుంటున్న దంపతులకు 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు సహకారం అందించారు. మండలంలోని పసుమర్రులో ఆదివారం మాదాసు వీరాస్వామి, సామ్రాజ్యం దంపతుల కుమారుడు దీనరాజు వివాహం సందర్భంగా మంగళసూత్రం బహూకరించారు.

ప్రమాదవశాత్తూ చెరువులో పడి వ్యక్తి మృతి



క్రోసూరు: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ సుభాని(40) ప్రమాదవశాత్తు చెరువులో పడి ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లారీ డ్రైవర్‌గా పనిచేసే షేక్ సుభాని ఆదివారం చేపలు పట్టుకునేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారీ పడిపోవడంతో ఈతరాక మృతి చెందాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలాగఫూర్, పార్టీ మండల అధ్యక్షుడు వెలిది అప్పారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటిదాసు, కోటిరెడ్డి తదితరులున్నారు.

ఘంటసాల, బాలు గానం అజరామరం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: అమర గాయకులు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యాలను తెలుగువారు ఎన్నడూ మర్చిపోలేరని, వారి గానం అజరామరమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. స్థానిక ప్రకాష్‌నగర్‌లోని భువన చంద్ర టౌన్ హాలులో ఆదివారం పోతార్లంక రవి మాస్టారు ఆధ్వర్యంలో నరసరావుపేట సంగీత కళాకారుల సేవాసమితి ప్రతినిధులు నిర్వహించిన అలనాటి సినీ సంగీత సౌరభవాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. అమర గాయకుడు ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రమణ్యం ఆరాధనోత్సవంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయనతోపాటు డీఎస్పీ కె.వి.మహేష్, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రముఖ లలిత సంగీత కళాకారుడు, కీబోర్డు ప్లేయర్ యం.ఎస్.బాబును ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సంగీత విభావతి ప్రేక్షకుల్ని అలరించింది. నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వర్‌రెడ్డి, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఈ.ఎం. స్వామి, దుర్గ స్టూడియో బాబు, సంరక్ష సొసైటీ కార్యదర్శి, గాయకుడు సుశీల్‌కుమార్, డాక్టర్ శనివారపు హనిమిరెడ్డి, గాయని, గాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అబిమానులు పాల్గొన్నారు.



టౌన్ హాలులో ఎం.ఎస్.బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నిర్వాహకులు

విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

హైదరాబాదుకు చెందిన విశ్వజనని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నరసరావుపేట సినీ సంగీత విభావరి బెస్ట్ సింగర్ అవార్డుల ప్రదానోత్సవాన్ని అరండల్‌పేటలోని జీఎల్‌ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా శాసన సభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రత్యేక అతిథిగా ప్లే బ్యాక్ సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రణయ్ కుమార్ హాజరయ్యారు. శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం అనేక మంచి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. గాయని, గాయకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాటలు మనసుకు ఎంతో అహ్లాదానిస్తాయన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి బెస్ట్ సింగర్లుగా ఎంపికైన వారికి అవార్డుల్ని ప్రదానం చేశారు. ఆర్గనైజర్‌గా రాధా నాయుడు వ్యవహరించారు. కార్యక్రమంలో చింతా పుల్లారావు, వద్దుల సుబ్బారెడ్డి, వి.సాంబశివరావు, చిన్ని వెంకట శ్రీనివాసరావు, చేగు వెంకటేశ్వరరావు, బత్తుల విష్ణువర్ధన్, రాజేంద్రప్రసాద్, వెంకట అమర లింగేశ్వరావు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి రజిని జన్మదిన వేడుకలు



సాతులూరులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ రాణి, నాయకులు



అప్పాపురంలో కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు

నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాతులూరులో ఎంపీపీ తలతోటి రాణి కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉడతా వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. అప్పాపురంలో నిర్వహించిన వేడుకల్లో మండల మాజీ ఉపాధ్యక్షుడు కోయలమూడి సాంబశివరావు, సచివాలయ మండల కన్వీనర్ పటాన్ సుభాని, మండల కో–ఆప్షన్ మెంబర్ మూసా సలాం, నాయకులు పాల్గొన్నారు. నాదెండ్లలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కాట్రగడ్డ రామకృష్ణ, చెంచురాజు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ట్రాన్స్‌జెండర్స్ బోనాలు

నరసరావుపేట: పట్టణంలో ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం ట్రాన్స్‌జెండర్లు ప్రకాష్‌నగర్‌లోని గంగమ్మ తల్లికి మేళాలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భిక్షాటన ద్వారా జీవనం చేసే తమకి దానం చేసిన ప్రతి ఒక్కరూ పిల్లాపాపలతో చల్లగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటామన్నారు. ప్రతి ఆషాఢంలో పూజల్ని నిర్వహిస్తామని, మొదటిసారిగా పల్నాడు జిల్లా ఏర్పడిన తరుణంలో తాము జిల్లా కేంద్రంలో ఉన్నందుకు గర్వపడుతున్నామని పేర్కొన్నారు. తమకు అన్ని విధాలుగా సహకరిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్, పోలీసు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఏ ప్రభుత్వం కల్పించని విధంగా వైస్సార్ సీపీ ప్రభుత్వం సొంత ఇళ్లను ఇచ్చిందని, తమకు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.



బోనాలు ప్రదర్శిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

గ్రామీణుల్లో సృజనాత్మకత, నైపుణ్యత నవీకరణకు కృషి

పలు గ్రామాలో పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ సభ్యుల పర్యటన

బొల్లాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సృజనాత్మకత, నైపుణ్యత గుర్తించి నవీకరణతో పాటు పర్యావరణాన్ని కాపాడడంలో పల్లె సృజన స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తోంది. ఈ దిశగా సభ్యులు ఇప్పటిదాకా అనేక కార్యక్రమాలు చేపట్టారు. మూడ్రోజులుగా ఈపూరు మండలం కొండ్రముట్ల నుంచి బొల్లాపల్లి మండలం మేళ్లవాగు వరకు సుమారు 36 కిలో మీటర్లు కాలినడకన పలు గ్రామాల్ని సభ్యులు సందర్శించారు. అటవీ ప్రాంతాల్లోనూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అటవీ ప్రాంతాన్ని కాపాడుకోవాలని బృందం సభ్యులు గ్రామీణ ప్రాంతవాసులకు సూచించారు. ఆదివారంతో మేళ్లవాగు వద్ద పర్యటన ముగించారు. దాదాపుగా 22 మందికి పైగా సభ్యులతో కూడిన బృందం ఆయా గ్రామాల్ని కాలినడకన సందర్శించింది. వీరిలో విద్యావంతులు, ఉన్నత ఉద్యోగస్తులు ఉన్నారు. సమాజ సేవతో పాటు గ్రామాల్లో నైపుణ్యతను గుర్తించి పట్టణాలకు అందజేయడమే ప్రధాన ఉద్దేశమని పల్లెసృజన వ్యవస్థాపకులు పోగుల గణేశం, పర్యావరణ సామాజిక కార్యకర్త కొమిరి జాజి తెలిపారు. గ్రామస్థాయిలో ఎంతో నైపుణ్యత దాగి ఉందని, అక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించుకునే శాస్త్రవేత్తలు ఉన్నారని తెలిపారు. పచ్చదనం, పర్యావరణాన్ని కాపాడడం కోసం అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేతతో పాటు అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతంలో చల్లినట్లు చెప్పారు.



అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాల్ని ఏరి వేస్తున్న సభ్యులు

లింగారావుపాలెంలో మెగా వైద్య శిబిరానికి స్పందన

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలో ఆదివారం గుంటూరు కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు ఆలోకం పెద్దబ్బాయి భార్య వెంకాయమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నటుడు చిట్టినేని లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు కల్యాణ చక్రవర్తి, కె. విద్యాధర్, హిమజ, వివేకానందరెడ్డి, మర్రి పెద్దయ్య, గుంటుపల్లి భవ్యతేజ, నన్నపనేని నిఖిత, శొంఠినేని నవ్య సేవలందించారు. 450 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. లింగారావుపాలెం చరిత్ర, అభివృద్ధిపై గ్రామపెద్దలు రాసిన 'జ్ఞాపిక' పుస్తకాన్ని సంకలనాన్ని డాక్టర్ మర్రి పెద్దయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్ విజ్ఞాన కేంద్రం బాధ్యులు నూతలపాటి కాళిదాసు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కిలారు వెంకట్రావు, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె. రామిరెడ్డి, ఎండోమెంట్ కమిషన్ రిటైర్డ్ డైరెక్టర్ పోపూరి గంగయ్య చౌదరి, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన పాల్గొన్నారు.



లింగారావుపాలెంలో నిర్వహించిన శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉద్యోగాలకు ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల పాలకవర్గ ప్రతినిధులు, అధ్యాపకులు

నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో టెక్నోటాస్క్ బిజినెస్ సెల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 58మంది ఫైనలియర్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే ఉద్యోగాలలో చేరతారని, రూ.2.5లక్షల వార్షిక వేతనం లభిస్తుందని వివరించారు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు అమీర్ సోహెల్, జి.అనిల్‌కుమార్ ఎంపికలు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. విద్యార్థుల్ని కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త అభినందించినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలని, సంక్షేమ పథకాలన్నిటినీ పునఃప్రారంభించాలని ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వనున్నామని, అప్పటికీ ఫలితం లేకపోతే చలో విజయవాడ నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులో గల సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం పల్నాడు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కాగా, సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, ఉపాధ్యక్షుడు కొమ్ముల సురేష్, సహాయ కార్యదర్శులు కోట ఆంజనేయులు, చిలక యేసు, కొత్తపల్లి సాంబశివరావు, కాసు కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

వినుకొండ (నూజెండ్ల): మండలంలోని ములకలూరులో నెక్స్ట్ జనరేషన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన హోప్ ఇన్ హాస్పిటల్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కంచర్ల బాబు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు పలువురికి కంటి, గుండె, ఆర్థో, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెక్స్ట్ జనరేషన్ చైర్మన్ నాగండ్ల శివరామకృష్ణ, ట్రెజరర్ కృష్ణవేణి, వైద్యులు నజీరుద్దీన్, షమా సుల్తాన్, నాగేశ్వరరావు, సుధీర్, జగపతి, నవీన్, వలీ, అనిల్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయంలో లాప్‌టాప్ చోరీ



దుండగులు పగలగొట్టిన సచివాలయం-1 తలుపులు



రెండో సచివాలయంలో స్టోర్ రూమ్ తాళాలు పగలగొట్టిన దుండగులు

నాదెండ్ల: గణపవరం సచివాలయం-1లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్ తెలిపిన వివరాల మేరకు.. సిబ్బంది శనివారం తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం ఉదయం శుభ్రం చేసేందుకు వచ్చిన పనివారు చూసి చోరీ జరిగినట్లు గుర్తించి అధికారులకు సమాచారమిచ్చారు. రూ.70వేలు విలువజేసే లాప్‌టాప్‌ను దొంగలు ఎత్తుకు పోయారు. దీన్ని ఇటీవల ఆధార్ కేంద్రం కోసం అధికారులు అందించారు.

రెండో సచివాలయంలో విధ్వంసం

ఆదివారం తెల్లవారుజామున పై అంతస్తులోని రెండో సచివాలయం తలుపులు పగలగొట్టి దొంగలు ప్రవేశించారు. పక్కనే ఉన్న స్టోర్ రూం తాళాలు పగలగొట్టారు. వస్తువులు చిందర వందర చేశారు తప్పా వస్తువుల్ని తీసుకెళ్లలేదు. సంఘటనలపై పోలీసులకు సిబ్బంది రాతపూర్వక ఫిర్యాదు చేశారు. స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

ఒయాసిస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులతో సంస్థ సభ్యులు

చిలకలూరిపేట టౌన్: చదువుకు పేదరికం ఆటంకం కారాదని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ తెలిపారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 18 మంది విద్యార్థులకు రూ. 7వేల చొప్పున మొత్తం రూ. 1.26 లక్షలను అందించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు పైచదువుల నిమిత్తం సంస్థ చేయూత నిస్తుందని చెప్పారు. గత పదేళ్లుగా అనేక మందికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కారుమంచి శివరావు, జాష్టి ప్రమీల, బి. సుబ్బారావు, గంజి చెంచుకుమారి, కందిమళ్ల నారాయణమూర్తి, ఎండీ. కరీమా, కరణం విజయ పాల్గొన్నారు.


సాగర్ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు

విజయపురిసౌత్: శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ భక్తులకు క్రీస్తు ప్రసాదించాలని ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ అన్నారు. ఆదివారం సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలి పూజలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మను ప్రసాదించిన సాగర్‌మాత ఆశీస్సులు అందరి యందున ఉంటాయని, ఆ తల్లిని భక్తివిశ్వాసాలతో పూజిస్తే కోరికలతో పాటు పాపాలు సైతం చెరిగిపోతాయని ఆయన ఉద్బోధించారు. అనంతరం భక్తులు దేవాలయంలో తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.



సాగర్‌మాత దేవాలయ ప్రాంగణంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి



ఈపూరు: విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో మూడు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన ఈపూరులో ఆదివారం చోటు చేసుకుంది. వారం రోజుల కిందట గాలివానకు గ్రామంలో విద్యుత్ వైరు తెగిపడింది. సిబ్బంది మరమ్మతులు చేపట్టకుండా వదిలివేశారు. ఈ క్రమంలో అటువైపు మేత కోసం వెళ్లిన కొంగ వీరయ్య, అంజయ్య, బుజ్జిలకు చెందిన పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. గేదె ఒక్కొక్కటి విలువ రూ. 50 వేలు ఉంటుందని, పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

రొంపిచర్లలో..

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నవరంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తిరువీధుల వెంకయ్యకు చెందిన గేదె మధ్యాహ్నం పొలాల్లో గడ్డి మేస్తుండగా, తెగిన విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ. లక్ష ఉంటుందని వెంకయ్య వాపోయారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మజ ఆదివారం తెలిపారు. ఈనెల 27 వరకు దరఖాస్తుల్ని తీసుకుంటామన్నారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు మెరిట్, రోస్టర్ విధానంలో సీట్లు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేటి నుంచి కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే

శావల్యాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తారని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ ఆదివారం తెలిపారు. సర్వే వచ్చే నెల 16 వరకు జరుగుతుందని, ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. శరీరంపై స్పర్శ లేని రాగి వర్ణపు మచ్చలున్నవారు వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కుష్ఠు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి సకాలంలో చికిత్స చేస్తే నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వం కూడా ఉచితంగా మందులు అందిస్తోందని ఆయన చెప్పారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

బొల్లాపల్లి: రెవెన్యూ భూ సమస్యలపై రైతులు నేరుగా తనను సంప్రదించాలని తహసీల్దార్ ఎ.వి. సుధాకర్ తెలిపారు. నూజెండ్ల మండల డెప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై బొల్లాపల్లి తహసీల్దార్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం చుక్కల భూముల సమస్య నుంచి రైతులకు ఉపశమనం కలిగిందన్నారు. రీ సర్వేకు సహకరించాలని, భూమి ఉన్న ప్రతి రైతుకు న్యాయం చేస్తామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ

పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారిని ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు బోనాలను సమర్పించేందుకు ఆలయం వద్దకు బారులు తీరడంతో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ పూజారులు, దేవస్థాన కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాల్లోని రెంటచింతల-7(జనరల్), జెట్టిపాలెం-1 (బిసి-డి), పశర్లపాడు-3(ఎస్సీ) అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్ ఎం.జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థినులు 7వ తరగతి ఉత్తీర్ణులై , 2023 జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. తప్పనిసరిగా స్థానికురాలై ఉండాలని, కచ్చితంగా వివాహితురాలై గ్రామానికి కోడలై ఉండాలన్నారు. దరఖాస్తు, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లతో ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు సమగ్ర శిశు అభివృద్ధి పథకం అధికారి మాచర్ల వారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక రిజర్వేషన్ కేటగిరీ వారీగా జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు శిశు అభివృద్ధి పథకం అధికారిణి ఐసీడీఎస్ ప్రాజెక్టు మాచర్ల కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి

సత్తెనపల్లి (ముప్పాళ్ళ): రైతుభరోసా కేంద్రంలో ఖాళీగా ఉన్న యానిమల్ హస్బండరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ)యానిమల్ హస్బండరీ అసిస్టెంట్(ఏహెచ్ఏ) ఆధ్వర్యంలో విజయవాడలోని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో రామన్న మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చినప్పటికీ అధికారులు కొత్తగా క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి 3 నుంచి 5 రైతు భరోసా కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి మిగులు పోస్టులను చూపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల నుంచి డైరీ ఒకేషనల్, డిప్లొమా చదివిన అభ్యర్థులు సుమారు 30 వేల మందికి పైగా నష్టపోతున్నారన్నారు. ఈ క్లస్టర్ విధానం వల్ల అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. దాన్ని రద్దు చేసి ఖాళీగా ఉన్న 4,765 పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, ఆంజనేయరాజు, నాయకులు పాల్గొన్నారు.